# పువ్వూ-తుమ్మెదా

అందాల పూదోట-ఆ తోటలోన
అందందు పూశాయి-ఎన్నెన్నో
పూలు—

రంగురంగుల పూలు సొగసుగావాలి
ఊగుతుంటే, గాలి జోకొట్టుతోంది

తూరుపు దిక్కునుండి వస్తోన్న కుంకుమ రంగుల కాంతులు-ఆ పూలకు బంగారు పూత పూశాయి. బాల భానుడు అప్పుడే తూరుపు కొండల మీద-కొండ కొసల నడుమ నుండి పైపైకి లేస్తున్నాడు. పూల సువాసనల బరువుతో మెల్లమెల్లగా వీస్తున్నాయి పిల్లగాలులు. కనుల పండువు గొలిపే పూల తోట.

ఆతోట నడుమనొక తెలినీటి
కొలను—

ఆ కొలని కొకప్రక్క ఒకరాతి
బొమ్మ—

ఆ బొమ్మ నల్లుకొని ఒక్కపూదీవె-
ఆ తీగె తలపైన ఉన్నదొకపూవు...

అప్పుడే వికసించిందా పువ్వు. పువ్వుల్లోకల్లా సొగసైన పువ్వు.

కనువిప్పి చూచింది. ఆహ్లాదకరంగా వుంది ప్రపంచం. అవతలి వైపునుండి అల్లంత దూరాన-అద్దాల మేడ - కనుచూపు దూరాన ఎత్తైన రాతికోట—

సరోవరంలో కొద్దిమాత్రంగా వున్న వాటి ప్రతిబింబాలు అలల కదలికలలో చెదరిపోతున్నాయి.

గున్నమామిడి
చెట్టులో నుండి
కోయిల కూస్తోంది.
ఎక్కడి నుండో



సన్నసన్నగా
సంగీతస్వనం -
''జ్ జ్ జ్ జ్''

విన్నది పుష్పసుందరి—
చెవులు రిక్కించింది.
హోయి!......హోయి!
ఆ వస్తూన్నది - తుమ్మెద!

సుమసుందరి సంతోషం - లోతులు తీయలేని సముద్రం;-తల వూపుతూ ఎలుగెత్తి పిలిచింది!

"ఎందెందొ వెదికేవు-ఏమున్న
దయ్యా?
ఇందున్న నీదాని నందుకోవయ్యా!
చెలిమికోరితి, నన్ను కాలదన్నకుర-
వలదంటె రాబోకు-మళ్ళి, నా
పొందు—"

"ఝు" మ్మంటూ చేరువకు వచ్చింది తుమ్మెద. పాలరాతి బొమ్మ చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం చేసింది. పుష్ప పరిమళంతో తల మత్తెక్కింది. పూవుమీద గాలిలో తేలుతూ నృత్యం చేస్తూ పూలకన్నెతో అన్నది;

"పచ్చపచ్చని చెట్లు చొచ్చిచూశాను—
పొదరిండ్లలో దూరి, వెదకిచూశాను-
ఇక్కడున్నావేమె-చక్కనీదానా?
నక్కిచూస్తున్నావ-నన్నేడిపిస్తూ?"

చిన్నగా పూవుమీద వాలింది. ముద్దుపెట్టుకొంది. గిలిగింతలు పెట్టినట్లయింది పువ్వుకు. ఒళ్ళు పులకరించింది. సిగ్గుతో అటూ - యిటూ కదిలింది.

కొంతసేపు ఆనందంగా గడిచిపోయింది.

ఆ కొంతసేపూ గంభీర నిశ్శబ్దం——

ఆ వ్యవధిలో పుష్ప మధుపాలు రెండూ స్వర్గ సీమల్లో తేలిపోయాయి.

ప్రణయోద్యానంలో విహరించాయి.

ఆనంద కడలిలో ఓలలాడాయి.

రెండు హృదయాలూ కలుసుకున్నాయి. రెండు హృదయాల్లోనూ పరస్పరం ప్రేమ గాఢంగా వేళ్ళు పాతుకుపోయింది.

దివ్యసీమలనుండి ఊడిపడ్డాయి రెండూ. తుమ్మెద ప్రేమగా అన్నది;

"కదలలేకున్నానె-కదలిపోలేనె-
ఎవ నీదు వశమాయె-నిదియేమి
వింత?
నీరూపు, నీచూపు-తూపులై పొడిచె
నినువీడి నేనెట్లు మనగలనె-లలన?
మనసు నీ కర్పించి మనలేను నేను-
మనసు నాకర్పించి, మనలేవు నీవు-
మనలేము ఎడబాసి-కనుక యీ
క్షణమే-
మనము పెళ్ళాడుదాం-నీకిష్టమేనా?"

తుమ్మెద పలుకులు విన్నది పూలబాల. సిగ్గుతో ముసిముసి నవ్వులతో సమ్మతిసూచకంగా తల ఊపింది.

ఒక్కసారిగా పూలతోట పెళ్లి విరిసింది.
చలువరాతిబొమ్మ మరింత వింతగా మెరిసింది.
ప్రకృతి కలకలలాడింది.
కోయిల పాటలు పాడింది.
నెమలి నృత్యం చేసింది.

నిశ్శబ్దంగా - ప్రకృతి సాన్నిధ్యంలో - పెళ్ళి జరిగి పోయింది.

వధూవరులు అక్కడ నిలబడి చూస్తోన్న ప్రేమ సాక్షి శిలా ప్రతిమకు వందన మాచరింపగా—శిలా ప్రతిమ వారిని మూగభాషలో ఆశీర్వదించింది.

ఆ సమయంలో ఉన్నట్లుండి రాతిబొమ్మ ముఖం మీద విషాదరేఖలు క్రమ్ముకున్నాయి. కనురెప్పలు కన్నీటి చెమ్మతో మిలమిల్లాడాయి.

పూవూ, తుమ్మెదా యీ వింత చూశాయి. ఆశ్చర్య పోయాయి.

"ఎందుకమ్మా బొమ్మ-అందాల
మోము
కందిపోయెను?—దాని కారణం
బేమి? ...."

అని అడిగాయి బొమ్మను.

బొమ్మ యిలా అంది;

"రతి మన్మధులవంటి మిమ్ము
చూస్తుంటే
పాతకథ-ఒకగాథ-స్మృతిలోన
మెదిలె...."

పాత కథ...

ఒక గాథ...

స్మృతిలోన మెదిలిన కారణంగా–

రాతిబొమ్మ విచారిస్తోంది.

ఏమిటా గాథ ?

ఎటువంటి జాలిగాథ ?

ఎవరిని గూర్చిన కథ ?

నూతన వధూవరులకు కథ వినాలన్న కుతూహలం మితిమీరింది.

"ఎపుడు చూశావమ్మ-మావంటి
జంట?
ఏమిటా కథ-కొంత వినిపింప
వమ్మ!...."

అని అడిగాయి ప్రతిమను.

ప్రతిమ కొన్ని క్షణాలు వూరుకొన్నది.

దూరాన ఉన్న కోటకేసి-అవతల ఉన్న మేడకేసి-తర్వాత ఎదురుగా ఉన్న కోనేటికేసి నిర్జీవంగా చూసింది.

ఆ చూపుల్లో దాగి ఉంది—ఏవో బాధ గొలిపే జాలి గాథ!

మెల్లగా కథ చెప్పడానికి ఉపక్రమించింది.

* * *

"ఇప్పుడు మీరున్నట్టి యీ తోట
లోనే
ఆ గాథ జరిగింది—కొన్నేళ్ళ
ముందు....
దూరాన కనిపించు ఆ కోటనేలు
రారాజునకు కలదు గారాలపట్టి ....
అల్లదిగొ-అటువున్న ఆ మేడలోనె
ఆ రాజ సుకుమారి ముద్దుగా
పెరిగె....

శుక్లపక్ష చంద్రునిలా పెరిగి పెద్దదైంది రాకుమారి పదహారేళ్ళ కన్నె ప్రాయం—

పాల పొంగులాంటి యౌవనం—
అసమాన సౌందర్యం—
మిసమిసలాడే పసిడి వర్ణం—
నిజానికి అందాల భరిణె అవతరించిన రతీదేవి.

ఆమె యీ తోటలో విహరిస్తూంటే - వనదేవత నడిచి పోతున్నట్లుండేది.

పూలు ఆమె చుట్టూ చేరి గుసగుసలాడేవి. తీగలూ పొదరిండ్లూ ఆమె కాళ్ళకు అడ్డు తగిలి తామరమొగ్గల్లా ఉన్న ఆమె పాదాలను ముద్దు పెట్టుకునేవి. తనమీద నడుస్తోంటే ఆమె మృదువైన పాదాలు ఎక్కడ కందిపోతాయో అని లేత పచ్చిక భయపడేది. పూల తేనెలను జుర్రుతోన్న తుమ్మెదలు చంచలమైన మనసులతో పూలను విడిచిపెట్టి - ఆమె తలచుట్టూ గుంపులు గూడి తిరిగేవి. గున్నమామిడి గుబురులలో నుండి గండుకోయిలలు యివతలికి వచ్చి—"కుహూ" అంటూ ఆమెతో చనువుగా పరిహాసమాడేవి.

—ఈవిధంగా గడుస్తోంది ఆమె యౌవనకాలం.

ఒక రోజు తన చెలికత్తెలతో సరదాకని యీతోటలోనే విలువిద్య నేర్చుకుంటోంది. దూరంగా వున్న చెట్ల

లోని పిట్టల మీదికి గురిపెట్టి బాణాలువేస్తోంది. చేతకాని రాకుమారి వేసిన బాణాలన్నీ గురి తప్పిపోతూనే వున్నై.

విల్లెక్కు పెట్టి ఒక్క బాణం విడిచిందామె. కొన్ని క్షణాలతర్వాత ఎవరో బాధగా అరచిన శబ్దం వినిపించింది.

రాకుమారి గుండె ఝల్లుమంది!

ఆమె విడిచినబాణం తోటవెలుపల నడిచిపోతూన్న ఒక సిపాయి భుజానికి బలంగా గుచ్చుకొంది.



రాకుమారి పరుగులో అతణ్ణిసమీపించింది. స్పృహ లేకుండా పడివున్నాడు ఆ సిపాయి.

హృదయం క్షోభించింది. జాలి పడింది. ఒక చెలి కత్తెను కాస్త నీళ్ళు తెమ్మంది. బాణాన్ని పెరికి అవతల పారేసి గాయానికి కట్టు కట్టింది.

ఆ మధుర స్పర్శకు ఆమె ఒళ్ళు జలదరించింది. చెలికత్తె తెచ్చిన నీటిని అతని ముఖంమీద చల్లి తన పలుచని చీరకొంగుతో విసరింది.

కాసేపటికి తెప్పరిల్లాడా సిపాయి. బాధగా లేచి, రాకుమారిని చూచి ఆశ్చర్యంగా వెనక్కు రెండడుగులు వేశాడు.

రాకుమారి అతని కన్నుల్లోకి చూసింది.
ఇద్దరి చూపులు కలుసుకున్నై.
ఇద్దరి హృదయాలు మూగగా మాట్లాడుకున్నై.
రాకుమారి మనసులో తీయని ఆశలూరాయి.

''పొరబాటుగా తగిలింది. బాధగా వుందా?'' అంది రాకుమారి తేరుకొని నునుసిగ్గుతో.

''ఫరవాలేదులే, అదే పోతుంది'' అని కొంతసేపు ఆలాగే నిలబడి ఆమెకేసి చూస్తూ ''వస్తా'' అని వెళ్ళిపోయాడు సిపాయి.

అతన్ని చూస్తూ తీయని తలపులను రేపుకుంటూ అలాగే నిలబడిపోయింది రాకుమారి.

*  *  *

చిలిపిగా పూవు వంక చూసింది తుమ్మెద. చిరునవ్వు నవ్వుతూ క్రీగంట చూస్తోన్న పూవు, తుమ్మెద తన వైపుచూడ్డం చూసి సిగ్గుపడింది.

రాతిబొమ్మ మళ్ళీ కథలోకి దిగింది.

* * *

''ఆరోజు నుండి ఆ సిపాయి ఇక్కడికి వస్తూ రాకుమారి వినోద క్రీడలను చాటుమాటుగా చూస్తూ వుండే వాడు. చెలికత్తెలతో అతనిని గురించి రెండు మూడు సార్లయినా ప్రస్తావించి వుంటుంది రాకుమారి.

ఆమె అందం, చందం, చక్కని యౌవనం అతని యువక రక్తాన్ని పరుగులు వారించింది.

గాఢంగా ప్రేమించాడు—రాకుమారిని.

ఒకనాడు ఆమె చలువరాతి తిన్నెమీద ఒంటరిగా కూర్చుని ఏమో ఆలోచించుకుంటోంది.

ఆ సిపాయి—ఆనాటి సంఘటన తర్వాత మళ్ళీ కనిపించలేదు. అతనిని గురించే తలపోస్తోందామె. తొలి చూపులోనే తన హృదయాన్ని అతనికి అర్పించేసింది. అతను చూసిన జాలి చూపు ఆమె మనసును కదిలించింది. ఆమెలో అణగారిన కోరికలను ఉసికొల్పి, మేల్కొల్పింది. హృదయంలో ప్రేమాగ్నిని రగుల్కొలిపింది. ఆమె యీ

ఆలోచనలతో మైమరచి వున్న సమయంలో వెనుకవైపు నుండి "అబ్బా బాధ" అన్న దీనాలాపం వినిపించింది. ఉలిక్కిపడి అదురుతున్న గుండెలతో వెనుదిరిగి చూసింది రాకుమారి.

అతనే! ఆసిపాయే! తనగుండెలను బాధగా అదిమి పట్టుకొని వున్నాడు.

రాకుమారి మనసు కలతచెందింది. చేరువకు వచ్చి "ఎక్కడ?" అంది అప్రయత్నంగా తనకు బాధ కలిగినట్లు.

"ఇక్కడ" అంటూ హృదయాన్ని చూపాడు సిపాయి.

రాకుమారి భీత హరిణంలా నలువైపులా చూసి అతనికి దగ్గరగావచ్చి అతని విశాల హృదయాన్ని మునివ్రేళ్ళ అంటీ అంటనట్లుగా తడవి చూసింది.

"అబ్బబ్బబ్బబ్బ" అంటూ కళ్ళు మూసుకున్నాడు సిపాయి. అది బాధయో లేక పరవశమో.

"ఎక్కడ? ఏమీలేదే?" అంది రాకుమారి.

"అక్కడ కాదు ఇంకా ప్రక్కన... ప్రక్కన... అహఁ కాస్త పైన....ఆఁ అబ్బ...."

రాకుమారికి వింతగా తోచింది. "గాయమే లేదే!" అంది ఆశ్చర్యంగా.

"లేదూ? ఔనులే! గాయం కనిపించదు. తగిలింది మన్మథ బాణం కదూ! గుండెల్లోనే గాయం—"అన్నాడు సిపాయి.

అతని హాస్యానికి ఫక్కున నవ్వింది రాకుమారి. సిగ్గు ముంచుకు రాగా తల వంచుకొని కాలివ్రేళ్ళతో పచ్చిక కొనలను మీటుతూ అతనివంక క్రీగంట చూస్తూ నిలుచుంది.

"రాకుమారీ!" అని మృదువుగా, ఆప్యాయంగా పిలిచాడు అతను. "ఆఁ!" అంటూ తన ఎఱ్ఱని పెదిమలను మెల్లగా కదిలించింది రాకుమారి.

"నీకో సంగతి చెప్పనా?"

తల ఊపింది రాజపుత్రి.

"నేనొక అమ్మాయిని ప్రేమించాను...."

రాకుమారి గుండెల్లో పిడుగు పడినట్లయింది. తెల్లబోయి అతనివైపు చూచింది.

చందమామలా సుందరంగా, మల్లెపూవులా మనోహరంగా, గుమ్మడిపూవులా గుంభనంగా ఉంటుందా పిల్ల.

ఆ పిల్ల నవ్వితే పూలతోట విరగబూసినట్లుంటుంది. ఆపిల్లను ప్రేమించాను నేను కానీ—'' అంటుండగానే యింక వినలేకుండా కోపంతో రొప్పుతూ అద్దాల మేడకేసి విసురుగా నడిచిపోయింది రాకుమారి.

అది చూచి కొయ్యబారిపోయాడు సిపాయి!

తానొకటి అనుకుంటే మరొకటి జరిగిందేం? కొంత సేపు అక్కడేవుండి తర్వాత నిట్టూర్చి వెళ్ళిపోయాడు.

తనను చుట్టుముట్టిన కుసుమ సౌరభాన్ని ఒక్కసారి వాసన చూచి మళ్ళీ ప్రారంభించింది రాతిబొమ్మ.

''ఆ మరుసటి రోజంతా రాకుమారి కోపంగానే ఉండిపోయింది. చెలికత్తెలెవరైనా పరియాచకాలాడితే పాములా బుసలు కొట్టింది.

ఆ రోజంతా పళ్ళు ఫలహారాలు ముట్టుకోనేలేదు. మంచినీళ్ళయినా త్రాగలేదు. ఆమె కోపాన్ని చూసిన చెలికత్తెలెవరూ ఆమె చెంతకు రా సాహసింపలేదు.

సంజవేళ—సూర్యుని నీరెండలో తోటంతా బంగారంలా మెరిసిపోతూంది. ఎర్రగా—కుంకుమ పులిమినట్లున్న పడమటి ఆకాశపు ప్రతిబింబంతో కోనేరు చూడ్డానికి యింపుగా ఉంది.

కోనేటిలో కాళ్ళుంచి నీళ్ళను గల గల లాడిస్తూ గట్టుపైన కూర్చున్నది రాకుమారి.

ఆమె మనసులో అంకురించిన అనురాగం మహా భూరుహంలా విరిగిపోయింది.

సిపాయిని ప్రేమించింది తను.

సిపాయి మరొకతెను ప్రేమించాడు.

ఎవరా అమ్మాయి?

ఎవరైతే తనకేం—?

—ఎంత అణచిపెట్టుకొన్నా యివే ఆలోచనలు పైకి లేస్తున్నాయి. తన హృదయేశుని హృదయాన్ని చూరగొన్న ఆ ధన్యురాలి మీద అసూయ పుట్టింది. తన 'కలిమి'ని తనకు దక్కకుండా చేసిన ఆ కఠినురాలిమీద ద్వేషం పుట్టింది.

—ఈవిధంగా సతమత మౌతున్నది - సిపాయిని అపార్థం చేసుకొన్న రాకుమారి.

ఎంత కాలం గడిచిపోయిందో తెలియదు. మసక చీకట్లు దిగంతాలను ఆవరిస్తున్నాయి.

ఆలోచనల నుండి తేరుకొని మరలి పోదామను కుంటూ ప్రక్కకు తిరిగింది.

సిపాయి—!

తనవైపే చూస్తూ తన సాన్నిధ్యంలోనే కూర్చొని ఉన్నాడు. ఎంతసేపటి నుండి ఉన్నాడో అలా!

రాజకుమారి ముఖం సంతోషంతో విప్పారింది. కాని అంతలోనె— క్రితం రోజు సంగతి గుర్తుకు రాగా ముఖం మీద క్రీనీడలు క్రమ్ముకున్నాయి.

అతనిని లెక్క చేయకుండా లేచి పోబోయింది.
లేవనీకుండా చేయి పట్టుకున్నాడు సిపాయి.
ఎంత సాహసం ?....
ఏమీ అనలేక పోయింది.
ఆమె కోపమంతా ఎలా పోయిందో తెల్రియదు.

"నేచెప్పా లనుకున్నవి పూర్తి కాకుండానేనా?" అంటూ లాగి కూచోబెట్టాడు సిపాయి.

"ఏమీ వద్దు-నే వెళ్ళాలి" అంది మృదువుగా అయ్యవారి ముందు పిల్లవానిలా.

"కాస్సేపేగా - వినేసి మరీ వెళ్ళు."
ఏమీ చేయలేకపోయింది రాకుమారి.
అతనిని ఎదిరించలేక పోయింది.

"ఆఁ— ఆ అమ్మాయిని ప్రేమించానా—కాని, ఆ అమ్మాయి కన్నెత్తి చూస్తే కస్సుమంటుంది. మాట్లాడ బోతే మూతి వంకరలు తిప్పుకొంటుంది. పిలిస్తే తొలగి పోతుంది. ఎలా ?- నేనేమో ఆ అమ్మాయిని మనసారా ప్రేమిస్తే ఇదా ప్రతిఫలం ?

చేరువకు వచ్చి, చేతిలో చేయి కలిపి, కన్నుల్లో కన్నులు కలిపి మనసు విప్పి మాట్లాడితేగా ? చెంపకు చెంప ఆనించి " నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను సిపాయ్ అంటే నాకడుపులో చల్ల బెట్టినట్లుంది " అంటూ చెప్పుకు పోతున్నాడు సిపాయి.

నువ్వు ప్రేమించిన అమ్మాయి ఎవరూ-అని అడగ లేదు రాకుమారి.

సిపాయి మాటలు ఆమె చెవులకు సూదిపోటులు- హృదయంలో గ్రుచ్చుకొంటున్న యీ టెలు.

కోపంతో ముఖం జేవురించింది.

తీగలా కంపిస్తూ " ఆ అమ్మాయి దగ్గరికే పోలేక పోయావ్ ? యిక్కడేం పని ?" అని కోపంతో అరిచింది.

సిపాయి ఆమె కోపానికి కొంచెమైనా చలించక పోగా - అతను నవ్విన చిరునవ్వు ఆమెకు మరింత కోప కారణమైంది.

నేను ప్రేమించిన అమ్మాయి దగ్గరకు కాకుండా మరెక్కడికి పోను? అన్నాడు సిపాయి జాలిగా.

ఆమాటలు విన్నది రాకుమారి. అర్థంచేసుకొన్నది.

మరుక్షణం కలువలా వికసించింది ఆమె ముఖం. అతని చేతుల్లోచేతులు వేసి "నిజంగానా సిపాయ్" అంది పొంగుతూన్న ప్రేమతో.



కోనేటిలో వారి ప్రతిబింబాలు నీటి అలలతో ఆడుకుంటూ వారికి మార్గదర్శకాలైనాయి........

ఆనాటినుండి రాకుమారీ - సిపాయీ రోజూ కలుసుకుంటూ వుండేవారు. వాళ్ళ ప్రేమ గాఢంగా రూపొందింది. ఇద్దరూ భూలోకంలో దేవలోకాన్ని సృష్టించుకొన్నారు.

మధుర రసాస్వాదనను వాంఛించే మధుపాయి-సిపాయి! తరగని మధువును నింపుకొన్న కన్నెపూవు - రాచకన్నె!!

ఇద్దరి జీవితాలు మధుర రుచి పూరితాలు.

*        *        *

కొంతసేపు విశ్రాంతి తీసుకొన్నది రాతిబొమ్మ. పూవు, తుమ్మెదలు ముఖాలమీద సంతోషం వెల్లివిరుస్తోంటే బొమ్మ ముఖం పైన విషాద రేఖలు ఆవరించాయి.

కథాపూరణకు ఉపక్రమించింది రాతిబొమ్మ !

"ప్రశాంతంగా వున్న వాళ్ళ ప్రేమసాగరంలో పెనుతుఫాను లేచింది. ఆ తుఫానుకు వాళ్ళ ప్రేమ నావ పటాపంచలై రూపు మాసిపోయింది..."

రాజ్యాలమధ్య యుద్ధాలు తీవ్రంగా విజృంభించాయి. రాజ్యకాంక్ష చేత—ప్రభువులు సిపాయీల నిండు ప్రాణాలను బలిపెట్టి రాజ్యాలను ఆక్రమించుకోసాగారు.

ఈ రాజ్యం మీదికి కూడా దండెత్తి వచ్చాడు పరరాజు. సైన్యం కదనరంగానికి ఉరికింది. "సిపాయికి" పని తగిలింది.

రాజ్యాన్ని రక్షించుకోవాలన్న పట్టుదల ఎక్కువైంది సిపాయీలకు. వీర రక్తం ఉరకలు వేస్తోంది వాళ్ళలో.

ఆరోజు ఉదయం యోధుని వేషంలో రాజకుమారి వద్దకు వచ్చాడు సిపాయి.

ఇద్దరూ తుదిసారిగా గాఢాలింగనంలో మైమఱచారు.
ఇద్దరి మనసులూ భారంగా వున్నాయి.
రాకుమారి మనసు కలత చెందింది.

ఆమె ఆలింగనాన్ని విడిపించుకొని సెలవు కోరాడు సిపాయి. కన్నీళ్ళతో వీడ్కోలిచ్చింది రాకుమారి.

తమ భార్యా బిడ్డల, ప్రియురాండ్ర జీవిత సమస్యలను కాలపురుషుని నిర్ణయానికి విడిచిపెట్టి మృత్యు మందిరమైన యుద్ధరంగానికి కదులుతున్న అతనివంటి అభాగ్య సైనికులు మరెందరో....



సిపాయి ఆమె ముంగురులను చక్కజేశాడు. ఆమె కన్నీళ్ళను తుడిచి ధైర్యం చెప్పాడు. త్వరలోనే తిరిగి వస్తానన్నాడు. ఆమె సాన్నిధ్యాన్ని విడిచాడు.

అతను వెళ్ళిపోతుంటే మామిడి గుబురులలోనున్న కోయిల చెలి "వద్దూ" అని ప్రాధేయపడింది. వినిపించు కోకుండా వెళ్ళిపోయిన సిపాయిపట్ల సానుభూతిగా చెట్టు నీడనున్న నెమలి "అయ్యో!" అంది.

* * *

కొన్నాళ్ళలో యుద్ధం ముగిసింది.

శత్రురాజు పరాజితు డయ్యాడు. చావగా మిగిలిన సైనికులు సంతోషంతో తమ ఆత్మీయులను తిరిగి కలుసుకొన్నారు.

కాని——

రాకుమారి వలచిన ఆ సిపాయి తిరిగిరానేలేదు—— అతని జాడే తెలియలేదు.

రాకుమారి ఎప్పుడూ పిచ్చిదానిలా తోటలో తిరుగుతూ వుండేది- తన ప్రియుణ్ణి తలచుకుంటూ! ఆనందం,

పారవశ్యం, అంతలో ఏదో భయం - యిటువంటి అను భూతుల్ని పొందుతూవుండేది.

సిపాయి తిరిగి వస్తాడు!
మళ్ళీ తనను ఏలుకొంటాడు!!

తాను అనుభవింపవలసిన సుఖం యింకా యెంతో వుంది—అని తనకు తానే ధైర్యం చెప్పుకుంటూ నిమిషం ఒక యుగంగా గడుపుతోంది.

యుద్ధం ముగిసిన తరువాత ఒక రోజు రాకుమారి కొలని గట్టున కూర్చునివుండగా ఒక చెలికత్తె పరుగెత్తు కుంటూవచ్చి "అమ్మా! ఆ సిపాయిచనిపోయాట్ట" అంటూ చెప్పలేక చెప్పింది.

రాకుమారి హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలై ప్రేలాయి. ఆమె కట్టుకున్న గాలిమేడ కుప్పగా కూలిపో యింది. ఆమెలోని ఆశలు నీటిబుడగల్లా పగిలిపోయాయి.

హృదయంలో కార్చిచ్చు రగుల్కొన్నది. తీరని వ్యధ ప్రారంభమైంది.

సిపాయిని తలచుకొని కంటికి మంటికి ఏకధారగా ఏడ్చింది రాకుమారి.

ఏడ్చి ఏడ్చి ఆమె కళ్ళు ఎరుపెక్కాయి. చెంపల మీద కన్నీరు చారలు కట్టింది.



లేచి నిలుచుంది.

చుట్టూ కలియజూసింది.

కంటికెవరూ కనిపించలేదు.

తిరుగులేని నిశ్చయం ఆమెది.

సిపాయిని ఒకమారు మనసులో స్మరించుకొంది.

నిర్జీవంగా, నిశ్చలంగా, నిర్భయంగా కొలనిలోనికి అడుగు పెట్టింది.

కొలని నీరు ఒక్కసారి గలగల మంటూ హాహా కారాలు సలిపింది!

భరింపరాని నిశ్శబ్దం...

బరువెక్కిన మనసుతో తుమ్మెదే అడిగింది చివరికి- "అయ్యో పాపం ఆరాకుమారి ఏమైంది ?"

జవాబు లేదు.

మాట్లాడలేదు రాతి బొమ్మ.

మౌనంగా వుండిపోయింది.

వేడిగా నిట్టూర్చి ప్రక్కకు తిరిగింది తుమ్మెద.

రాతిబొమ్మ జవాబుగా రాలిపోయిన పూవు గాలికి కొట్టుకుపోయి కోనేటి నీటి అలలపైన తేలియాడుతోంది.

ఈ విఘాతాన్ని సహించలేక హృదయ విదారకంగా రోద చేసింది తుమ్మెద.

ప్రతిమ శిలా హృదయం
ద్రవించి కన్నీరై జారి
చెక్కిళ్ళ మీద నిలిచి
అక్కడే- ఆలాగే
గడ్డ కట్టుకుపోయి
శిల్పి చేసిన లోపాన్ని
పూరించుకొంది!

